క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ప్రగతినగర్ సబ్‌స్టేషన్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలియజేశారు. 33/11 కేవీ బొల్లారం ఎస్ఎస్-3 నిర్వహణ నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 11కేవీ బాలాజీ వెంచర్, 11 కేవీ మల్లంపేట్, 12 కేవీ ప్రణీత్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

21మందికి కరోనా నెగిటివ్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 21మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చాయి. కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

జయభేరి కాలనీ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



కొంపల్లి చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న జయభేరి కాలనీ ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: జయభేరి కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కాలనీ ప్రతినిధులు బుధవారం కొంపల్లి చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని ప్రతిరోజు డ్రైనేజీ పొంగిపొర్లుతోందని.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. పెట్రోల్‌బంక్ నుంచి కాలనీ మీదుగా పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటుపై ప్రణాళికలు రూపొందించి పెద్ద పైపులైన్ వేయాలన్నారు. దీనిపై స్పందించిన ఆయన ఎస్టిమేషన్ సిద్ధం చేయాలని డీఈ చిరంజీవులుకు సూచించారు. సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వినోద్‌రెడ్డి, సిద్ధి రాంరెడ్డి, సుభాష్ చంద్రబోస్, విజేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


రేపటి నుంచి చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో 'బాలబృందావనం' పేరిట చిల్డ్రన్స్ సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. ఈ క్యాంప్‌లో పాల్గొనేందుకు 9 నుంచి 14 ఏళ్లలోపు వారికే అవకాశం. కార్యక్రమంలో పాల్గొనేవారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలి.

నేడు, రేపు అంతర్జాతీయ సమావేశం

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్ విభాగం, నేషనల్ ట్రాన్స్‌లేషన్ మిషన్(ఎన్‌టీఎం) సెంటర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సహకారంతో రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆ విభాగం హెడ్ ప్రొఫెసర్ షాహీన్ బుధవారం తెలిపారు. 'భాష, సాహిత్యం యొక్క విభజనలను అన్వేషించడం' అనే అంశంపై ఈ సమావేశం సాగుతుంది. గురువారం ఉదయం 11 గంటలకు ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ఈ సమావేశాన్ని ప్రారంభిస్తారు. పరిశోధనా ఫలితాలు, అనుభవాలను పంచుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు.

బడ్జెట్‌లో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలి



కవాడిగూడ: రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. ప్రజలందరికీ విద్య, వైద్యాన్ని ఉచితంగా ప్రభుత్వమే ఇవ్వాలని కోరుతూ.. ఉచిత వైద్య, విద్యాసాధన సమితి, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసన దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు మద్దతుగా ప్రొఫెసర్ కోదండరాం పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ వ్యవస్థాపకుడు సదానందరెడ్డి, ఉచిత విద్య, వైద్య సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, టీజేఎస్‌గ్రేటర్ కార్యదర్శి ఎం నర్సయ్య హాజరయ్యారు. కోదండరాం మాట్లాడుతూ.. విద్య, వైద్యానికి కనీస బడ్జెట్ కేటాయించలేని దుర్మార్గపు పాలన నడుస్తోందని ఆరోపించారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ నీలారెడ్డి



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై, పార్కుల అభివృద్ధి, పార్కుల్లో మూత్రశాలల ఏర్పాటు, దోమలు, వరద ముంపు నివారణకు తీసుకుంటున్న చర్యలపై మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డితో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న. కార్పొరేషన్ పరిధిలోని మురికివాడల్లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను ఎలా పరిష్కరిస్తున్నారు?

జవాబు: రాజీవ్ గాంధీనగర్, ఇంద్రానగర్, సాయినగర్, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతల్లోని నీటి సమస్య ఉన్న మాట వాస్తవమే. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో మంచినీటి సంపులు, ట్యాంక్‌ల నిర్మాణం తది దశకు వచ్చాయి. త్వరలోనే ఈ సంపులు వినియోగంలోకి వస్తే ప్రజలు ఎదుర్కొనే నీటి సమస్య శాశ్వతంగా తీరిపోతుంది. ప్రగతినగర్, సాయినగర్‌లలో 60 లక్షల లీటర్ల సంపు, రాజీవ్ గాంధీనగర్ లో 5లక్షల లీటర్ ఓవర్‌హెడ్ ట్యాంక్, ప్రగతినగర్‌లో 10లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంక్‌ల నిర్మాణం జరుగుతున్నాయి. వీటిని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం.

ప్రశ్న:మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పార్కుల అభివృద్ధి, నిర్వహణ పూర్తి స్థాయిలో లేకపోవడానికి కారణం ఏమిటి.?

జవాబు: ఇప్పటికే చాలా పార్కులను అభివృద్ధి చేశాం. మిగతా ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధి చేయాల్సి ఉంది. వాటిని కూడా త్వరలోనే అందుబాటులోకి తెస్తాం. పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను సైతం ఏర్పాటు చేస్తాం. వాకింగ్ ట్రాక్‌లు, పంచతత్వ పార్కులను అభివృద్ధి చేస్తున్నాం.

ప్రశ్న: పార్కుల్లో మూత్రశాలలు లేకపోవడంతో ముఖ్యంగా మహిళలు ఇబ్బంది పడుతున్నారు. వీటి నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: పార్కుల్లో మూత్ర శాలలు చాలా వరకు లేవు. మహిళలు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని తప్పకుండా కౌన్సిల్ సమావేశంలో చర్చించి తీర్మానం చేసి వెంటనే వీటి నిర్మాణంపై దృష్టి పెడతాం.

ప్రశ్న: దోమల బెడద ఎక్కువగా ఉంది. ఈ సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు: కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఈ సమస్య ఉంది. దోమల నివారణకు ఫాగింగ్ రెగ్యులర్‌గా చేయిస్తున్నాం. అదే విధంగా తుర్క చెరువుతో పాటు మిగతా చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఈ పనులు ప్రారంభమయ్యాయి. చెరువుల్లోకి డ్రైనేజీ నీరు చేరకుండా ప్రత్యేక పైపులైన్ల ద్వారా నీటి మళ్లింపు పనులు చేపడుతున్నాం.

ప్రశ్న: నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్‌లలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. దీనిని ఎలా పరిష్కరించనున్నారు.?

జవాబు: రోజు రోజుకు పెరుగుతున్న జనాభాతో పాటుగా వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఇప్పటికే ఈ సమస్యపై ట్రాఫిక్ పోలీసులతో చర్చించాం. నిజాంపేట్‌లో అభివృద్ధి పనులు మూలంగా ట్రాఫిక్ మళ్లింపు జరుగుతోంది. అదేవిధంగా నిజాంపేట్ నుంచి డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయం మీదుగా తెలుగు యునివర్సిటీ నుంచి వీఎన్ఆర్ కాలేజ్ వరకు నూతన 100 ఫీట్ల రోడ్డు పనులు జరుగుతున్నాయి దీంతో చాలా వరకు ట్రాఫిక్ సమస్య తీరుతుంది. అదే విదంగా ప్రగతి నగర్‌లో కూడా ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. బాచుపల్లి చౌరస్తాలో ఫ్లైఓవర్ పనులతో పాటు రోడ్డు వెడల్పు జరుగుతోంది. ఈ పనులన్నీ పూర్తయితే దాదాపు ట్రాఫిక్ సమస్య తీరుతుందనే భావిస్తున్నాం.

ముగిసిన సమ్మర్ లెర్నింగ్ ప్రోగ్రాం



విద్యార్థులతో సీనియర్ నటి గీతా భాస్కర్..

దుండిగల్: విద్యార్థులు స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తీకరించుకునే వాతావరణాన్ని కల్పించడంతో పాటు వారిలో సృజనాత్మక స్ఫూర్తిని సృష్టించేందుకు లెర్నింగ్ ప్రోగ్రామ్‌లు ఎంతగానో దోహదపడతాయని ప్రముఖ విజువల్ ఆర్ట్స్ టీచర్, సీనియర్ నటి గీతా భాస్కర్ అన్నారు. బౌరంపేటలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించిన రెండో సమ్మర్ లెర్నింగ్ ప్రోగ్రాం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. వారిలోని నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మూడు నుంచి 13 సంవత్సరాల వయసు గల 50 మంది విద్యార్థులు ఈ సమ్మర్ లెర్నింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బల్జిత్ ఒబెరాయ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పద్మజ అంబటి తదితరులు పాల్గొన్నారు.

పుస్తె, మెట్టెల అందజేత

దుండిగల్: నిరుపేద ఆడబిడ్డ పెళ్లిలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో మేలు చేస్తున్నాయని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కావలి గణేష్ అన్నారు. దుండిగల్ గ్రామంలోని 5వ వార్డుకు చెందిన బ్యాగరి రమేష్, లక్ష్మిల కూతురి పెళ్లికి ఆయన పుస్తె, మెట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాలను ఆదుకుంటామన్నారు. ఇప్పటికే గ్రామంలో పలువురి వివాహాలకు ఆర్థిక సహాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో క్రాంతి, కుమార్, దేవా పాల్గొన్నారు.



పెళ్లి కుమార్తెకు పుస్తె మెట్టెలు అందజేస్తున్న కావలి గణేష్..

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి నిరుద్యోగులకు న్యాయం చేస్తాం



లెనిన్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రత్యేక చట్టం ద్వారా టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి నిరుద్యోగులకు న్యాయం చేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం గాజులరామారం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ లాస్ట్‌బస్టాప్, లెనిన్‌నగర్, అంబేడ్కర్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించిన ఆయన ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, జహంగీర్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గర్జన సభను విజయవంతం చేయాలి



ప్రజాగర్జన సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్

నిజాంపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో జరిగే ప్రజా గర్జన వాల్ పోస్టర్‌ను బుధవారం సీపీఐ నాయకుడు యాదయ్యతో కలిసి బాచుపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా గర్జన సభకు పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాగ్యమ్మ, నర్సమ్మ, యాదమ్మ, లక్ష్మి, నాగమణి, పుష్పమ్మ, అమృతమ్మ, పద్మమ్మ, మహేష్, కృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హైపర్‌టెన్షన్‌పై అవగాహన, ర్యాలీ

రాయదుర్గం: కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ), గ్లెన్‌మార్క్ ఫార్మా ఆధ్వర్యంలో బుధవారం హైపర్‌టెన్షన్‌పై అవగాహన,వాకథాన్ నిర్వహించారు. ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని ఉదయం 7 గంటలకు నిర్వహించగా వైద్యనిపుణులు, 150 మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైపర్ టెన్షన్‌తో పోరాడడానికి, నివారణ చర్యగా శారీరక శ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో 2.5 కిలోమీటర్ల వాకథాన్ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా డాక్టర్ వీఎస్ రామచంద్ర మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి ముగ్గురిలో ఒకరిని ఇది ప్రభావితం చేస్తుందన్నారు.దాదాపు 50 శాతం మందికి వారి పరిస్థితి గురించి తెలియదనే భయంకరమైన నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తున్నామన్నారు. 18 ఏళ్ల వయస్సు నుంచే గుర్తింపు, పర్యవేక్షణ అవసరమని ఆయన సూచించారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తారు..

చెత్తను అక్కడే వేస్తారు!

చింతల్: ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేస్తున్న దుకాణాలపై తీసుకున్న చర్యలు షరా మామూలుగానే మారాయి. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొన్నేళ్లుగా కొనసాగుతున్న అక్రమ దుకాణాలను జీహెచ్ఎంసీ అధికారులు పోలీసు ప్రొటెక్షన్ మధ్య గతంలో తొలగించారు. అనంతరం ఇక్కడ ఏర్పాట్లు చేసుకుంటున్న దుకాణాల యజమానులకు హెచ్చరికలు సైతం జారీ చేశారు.

- నేడు ఆ హెచ్చరికలు బుట్టదాఖలు చేస్తూ ఆక్రమించి రోజురోజుకు దుకాణాలు వెలుస్తున్నా ప్రస్తుతం పట్టించుకునే అధికారులు కరువయ్యారు. గాజులరామారం చౌరస్తా నుంచి షాపూర్‌నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం ముందు అనేక దుకాణాలు వెలిశాయి. ఇవి వాటర్ వర్క్స్ కార్యాలయం ప్రహరీకి అనుకుని ఉండటంతో సదరు నిర్వాహకులు పక్కా దుకాణాలుగా మార్చుకొని తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.



వాటర్ వర్క్స్ కార్యాలయ గోడకు ఆనుకుని ఏర్పాటు చేసిన దుకాణాలు

- ఈ దుకాణాలను నెలరోజుల క్రితం అధికారులు ఖాళీ చేయించారు. నేడు వారి వారి స్థానాలు ఆక్రమణదారులు తమ దుకాణాలను ఏర్పాటు చేసుకోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- ఇక్కడ ఏర్పాటు చేసుకున్న దుకాణదారులు కొబ్బరి బొండాలతో కార్నర్లు, జ్యూస్ సెంటర్ నిర్వాహకులు ఆటోమొబైల్ నిర్వాహకులు తమ దుకాణాలను వచ్చే ముడి సరుకులు వేస్టేజీని వాటర్ వర్క్స్ కార్యాలయం ప్రహరీ వద్ద పారబోస్తున్నారు. ఇలా పారబోసిన చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో ఇటీవలే ఆకతాయి చేసిన పనికి మంటలు వ్యాపించాయి. మంటలను గుర్తించిన స్థానికులు వెంటనే నీటిని తీసుకొచ్చి అదుపులోకి తెచ్చారు. కాగా నేడు వెలిసిన అక్రమ దుకాణాల దారులు తమ వేస్టేజీలను మరలా వాటర్ కార్యాలయం ప్రహరీ గోడకు ఆనుకొని పారబోసే అవకాశాలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.



ఖాళీ కొబ్బరి బొండాలను కార్యాలయ ప్రహరీ వద్ద పారబోసిన దృశ్యం

ఎన్టీఆర్ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయి

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలోని బహదూర్‌పల్లి ఎక్స్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని బుధవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రతినిధి హనుమంతరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఆయన జీవితం సాగిందన్నారు. తెలుగు సినిమాలలో ఆయన వేసిన పాత్రల ప్రభావం ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసిందన్నారు.

- రాజకీయ చైతన్యం, రాజకీయంలో నాయకులు ఎలా నడుచుకోవాలని చూపించిన మహనీయుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనని అన్నారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. పేదవాడి ఆకలి తీర్చేందుకు 2 రూపాయలకే బియ్యాన్ని అందించిన గొప్ప ప్రజా సంక్షేమ నాయకుడని కొనియాడారు. నటుడిగానే కాకుండా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజలకు అనేక సేవలు అందించారన్నారని గుర్తుచేశారు.
- బహదూర్ పల్లి చౌరస్తాలో చక్కటి స్థలాన్ని ఇచ్చి విగ్రహాన్ని ప్రతిష్టించిన కృష్ణారావు, నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్ భరత్, మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ట కమిటీ అధ్యక్షుడు బొడ్డు రవిశంకర్, మాజీ కౌన్సిలర్ రంగారావు, వీరబాబు, రామకృష్ణ, దిలీప్, అజయ్, నరేందర్, నర్సింహారావు, బాబి, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

వర్షకాలంలోపు కల్వర్టు పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా బుధవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని వాజ్‌పేయినగర్‌లో మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీష్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా పూర్తయిన సీసీ రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే మిగతా అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తిచేస్తామని తెలిపారు. డీఈఈ పాపమ్మ, మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ సోమేష్ యాదవ్, డివిజన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు కిషోర్ చారి తదితరులు ఉన్నారు.

- కాకతీయ నగర్ మార్కెట్ వద్ద రూ.88 లక్షలతో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షాకాలంలో వచ్చే లోపలే మిగిలిన పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



కాకతీయనగర్ మార్కెట్ వద్ద కల్వర్ట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

- గణేష్ నగర్ బస్టాప్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'ఏఎండీఎస్ ఈ బైక్స్ షోరూమ్‌ను ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ బైక్‌లను ప్రతి ఒక్కరూ వినియోగించాలన్నారు. షోరూమ్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తా

దుండిగల్: ఆలయాల అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బౌరంపేటలోని బంగారు మైసమ్మ ఆలయ నూతన కమిటీ సభ్యులు బుధవారం శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా సత్కరించారు. ఆలయాల అభివద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బౌరంపేట పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ చైర్మన్ రంగారెడ్డి, వైస్ చైర్మన్‌లు జంగారెడ్డి, కొమ్ము జీవన్, కోశాధికారి రాఘవరెడ్డి, కార్యదర్శి బెంబడి హనుమంతరెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, పీసరి కృష్ణారెడ్డి, మన్నేశేఖర్, బాలరాజు, చింతామల్లేష్ పాల్గొన్నారు.



శంభీపూర్ రాజును కలిసిన నూతన ఆలయ కమిటీ సభ్యులు



పాల్గొన్న శంభీపూర్ రాజు

అయ్యప్పస్వామిని దర్శించుకున్న శంభీపూర్ రాజు

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి శ్రీనివాస్‌నగర్ కాలనీలో జరుగుతున్న అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి శంభీపూర్ రాజు హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, ఫ్లోర్ లీడర్ ఆగం పాండులతో కలిసి ఆయన గణపతి పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధికి విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్‌రెడ్డి, చిట్ల దివాకర్, సుజాత, బాలాజీ నాయక్, ఆగం రాజు, నేతలు అభిషేక్‌రెడ్డి, లీడర్ నరసింహారెడ్డి, ప్రమీల సాయిలుయాదవ్, సుధీర్‌రెడ్డి, రంగరాయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనంతుల కరుణాకర్‌రెడ్డికి నివాళి

రంగారెడ్డినగర్: ప్రముఖ పారిశ్రామికవేత్త, యాంకర్ పరిశ్రమల అధినేత, లలితా పరమేశ్వరి దేవాలయ చైర్మన్ అనంతుల కరుణాకర్‌రెడ్డి సేవలు శ్లాఘనీయమని పలువురు పారిశ్రామికవేత్తలు అన్నారు. బుధవారం సాయంత్రం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి పంచశీల కాలనీలోని యాంకర్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రాంగణంలో పంచశీల కాలనీ ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు కరుణాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, శ్రీలలితా పరమేశ్వరి దేవాలయ కమిటీ అధ్యక్షుడు లయన్ .డాక్టర్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి సభాధ్యక్షత వహించారు.

- ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. రెండున్నర దశాబ్దాలుగా ఈ ప్రాంత పరిశ్రమల, కార్మికుల మనుగడ కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. దేవాలయం అభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడేవారని గుర్తు చేసుకున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే అనంతుల కరుణాకర్‌రెడ్డి మన మధ్య లేకపోవడం తీరనిలోటని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. అనంతరం కరుణాకర్‌రెడ్డి భార్య అనంతుల రజిత, కుమార్తెలు చరిత, నిఖిత, అల్లుడు స్వరూప్‌రెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు వినోద్, జి. కిషోర్ బాబు, వాసం బాలరాజు, నాగరాజు గౌడ్, పంచశీల కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు పి.సతీష్‌రెడ్డి, కేఎల్.రమణారెడ్డి, లయన్ విష్ణువర్ధన్‌రెడ్డి, లయన్ వేంకటేశ్వర్‌రెడ్డి, రామిని శ్రీనివాస్, రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, పరిశ్రమ కార్మికులు, సన్నిహితులు పాల్గొని నివాళులర్పించారు.



కరుణాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, పరిశ్రమల యజమానులు

ఎట్టకేలకు పెండింగ్ పనులకు మోక్షం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం లభించింది. డ్రైనేజీ, రోడ్డు పనులు దాదాపుగా అన్ని బస్తీలలో పూర్తయ్యాయి. కొన్ని నెలలుగా ప్రధాన రహదారులలో కూడా డ్రైనేజీ పనులు పూర్తి చేశారు. దీంతో రెండు వారులుగా సుమారు రూ.2కోట్లతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. శ్రీనివాస్‌నగర్‌లో ప్రధాన రహదారి పనులు తుది దశకు చేరుకున్నాయి. అలాగే జగద్గిరినగర్‌లో రూ. 30 లక్షలతో సోమవారం ప్రారంభం కాగా, అలాగే రింగ్ బస్తీలో రూ.35 లక్షలతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఇలా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్డు (గల్లీలు) పనులు మొదలు కావడంతో జగద్గిరిగుట్ట వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తుదిదశకు చేరుకున్న శ్రీనివాస్‌నగర్‌లో ప్రధాన రహదారి రోడ్డు పనులు



జగద్గిరినగర్‌లో ఇటీవలే ప్రారంభమైన రోడ్డు పనులు